

హండెకేలూర్‌లో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

మద్నూర్, జనవరి 25: మండలంలోని హండెకేలూర్ గ్రామంలో గురువారం పశు గణాభివృద్ధి సంఘం, పశు సంవర్ధక శాఖ జిల్లా ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశవ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పశు గణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మజీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 62 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించినట్లు మేనూర్ పశు వైద్యులు విజయ్ తెలిపారు. అదేవిధంగా దూడలలో నట్టల నివారణ 38లకు, సాధారణ చికిత్సలు 36 పశువులకు నిర్వహించినట్లు వెల్లడించారు.



పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం




పార్లమెంట్ ఎన్నికలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్ (ఫైల్)

- ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఈసీ ఆదేశాలు
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన జిల్లా యంత్రాంగం
- అధికారులతో, రాజకీయ పార్టీలతో ఇటీవల సమీక్షించిన కలెక్టర్
- ఇప్పటికే డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాకు కసరత్తు
- ఎన్నికల నోడల్ అధికారుల నియామకం
- మరోవైపు ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

కామారెడ్డి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరిలో ఎప్పుడైన ఎన్నికల షెడ్యూల్ రావచ్చని అందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఇటీవల ఒక జీవోను ఎన్నికల సంఘం జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాను సైతం ఇటీవల విడుదల చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తున్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. తుది ఓటరు జాబితా విడుదలైన వెనువెంటే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు సైతం చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలకు సిద్ధంగా ఉండేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియపై, ఓటరు జాబితాపై జిల్లా అధికారులతో పాటు ఆయా రాజకీయ పార్టీలతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగానే ఎన్నికలకు కీలకంగా వ్యవహరించే నోడల్ అధికారులను సైతం నియమించినట్లు తెలిసింది.

జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 16.25 లక్షల మంది ఓటర్లు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకారం మొత్తం 16,25,176 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులవి 7,96,300 మంది ఓటర్లు ఉండగా మహిళలవి 8,29,299 మంది ఓటర్లు ఉండగా ఇతరులవి 57 ఉన్నాయి. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2036 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.



శాసనసభ నియోజకవర్గాల వారీగా ఓటర్లు

కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోకి కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, జహీరాబాద్, ఆంధోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇటీవల ఎన్నికల కమిషన్ డ్రాఫ్ట్ ఓటరు జాబితాను విడుదల చేసింది. దీని ప్రకారం కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,54,079 ఉండగా పోలింగ్ కేంద్రాలు 266 ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,22,252 ఉండగా 270 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,00,820 ఉండగా 255 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,94,641 ఉన్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,72,585 ఉండగా 314 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,32,988 ఉండగా 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆంధోల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,47,709 ఉండగా 313 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని మార్పులు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతుంది. ఫిబ్రవరి 8న తుది జాబితాను విడుదల చేయనున్నారు.

నోడల్ అధికారుల నియామకం

జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోకి కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియ మొత్తం సంగారెడ్డి కలెక్టర్ నేతృత్వంలో కొనసాగనుంది. సంగారెడ్డి కలెక్టర్ జహీరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌కు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఉండనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ప్రారంభించడమే కాకుండా ఆయా జిల్లాల కలెక్టర్‌లకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించినట్లు తెలిసింది. ఇప్పటికే నోడల్ అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఎన్నికల ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు.

ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ త్వరలో రాబోతుందనే ప్రచారంతో జిల్లాలో రాజకీయ పక్షాలు లోక్‌సభ ఎన్నికల రణరంగానికి సిద్ధమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులను ప్రధాన పార్టీలు అప్రమత్తం చేస్తున్నాయి. కేంద్ర బడ్జెట్ సమావేశాల అనంతరం షెడ్యూల్ వస్తుందనే ప్రచారంతో ఎన్నికల్లో విజయం కోసం ప్రధాన పార్టీలు కార్యాచరణకు దిగుతున్నాయి. అభ్యర్థుల సంగతి ఎలా ఉన్నా పార్టీ గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్యనే తీవ్ర పోటీ నెలకొంటుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు స్థానాలను, బీజేపీ ఒకటి, బీఆర్ఎస్ ఒకటి స్థానాల్లో గెలుపొందాయి. అయితే జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల సంఖ్యే ఎక్కువగా ఉంది. తర్వాత బీఆర్ఎస్‌కు రెండు, కాంగ్రెస్‌కు ఒకటి సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో జహీరాబాద్ పార్లమెంట్‌పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. ఎంపీ స్థానాలను గెలిచేందుకు వ్యూహరచన పన్నుతోంది. అయితే ఈ మూడు ప్రధాన పార్టీల నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. ఎవరికి వారే టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

మత్తు పదార్థాలను అరికట్టడం ప్రతీ ఒక్కరి బాధ్యత

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 25: మత్తు పదార్థాలను అరికట్టడం ప్రతీ ఒక్కరి బాధ్యతని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తేలికగా డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో యువత అక్రమ మత్తుపదార్థాలు రవాణాతో పాటు వాటికి బానిసలవుతున్నారని, ఆదిలోనే గుర్తించి అరికట్టాలని అధికారులకు సూచించారు. కళాశాలలో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయుటపై అధికారులతో చర్చించారు. డ్రగ్‌ఫ్రీ తెలంగాణగా మార్చాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, మన జిల్లాలో కూడా గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణా, వినియోగం పూర్తిగా అరికట్టుటకు పోలీసు, అబ్కారి, వ్యవసాయ తదితర శాఖలు కంకణబద్ధులై పని చేయాలని కోరారు. గంజాయి సాగు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, కల్లులో అల్ఫాజోలం కలుపకుండా కల్లు డిపోలపై గట్టి నిఘా పెంచాలని అన్నారు. ఒక గ్రాము అల్ఫాజోలంతో 800 లీటర్ల మత్తు కల్లు తయారు చేయవచ్చని, దీనికి బానిసైన వారు 3,4 రోజులు తాగకపోతే పిట్స్ రావడం, పిచ్చిగా ప్రవర్తించడం జరుగుతుందని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించడమేకాక నేరస్థులుగా మారే ప్రమాదముందని యువత తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలన్నారు. ఇటువంటి వారిని ముందుగానే గుర్తిస్తే మానసిక వైద్య నిపుణులచే చికిత్స చేయిస్తామన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి ఆయా కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేదంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో 7 గురు యువత మత్తును ఇచ్చే హషిష్ ఆయిల్ వాడుతున్నారని గుర్తించి పట్టుకున్నామని, ఇది ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి వస్తున్నదని గుర్తించి చర్యలు తీసుకున్నామన్నారు. మత్తు పదార్థాలు వల్ల జరిగే అనర్థాలపై యువతకు సానుకూల దృక్పథంతో అవగాహన కలిగించాలని, కళాశాల దరిదాపుల్లోకి రాకుండా కట్టడి చేయుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ రవీంద్రరాజు మాట్లాడుతూ జిల్లాలో విస్తృత దాడులు చేస్తూ గంజాయి వంటి మత్తుపదార్థాల నివారణకు కృషి చేస్తున్నామని, గత రెండ్రోజుల కిందట 800 గ్రాముల గంజాయి పట్టుకున్నామని అన్నారు. కల్లు డిపోలకు కూడా మత్తు మందు కలుపవద్దని ఆదేశించామన్నారు. ఈ సమావేశంలో డీఈవో రాజు, ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్‌బాబు, డీఏవో భాగ్యలక్ష్మీ, వైద్యశాఖ ప్రతినిధులు వేణుగోపాల్, పద్మజ, సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రాజారెడ్డి, ఎఫ్ఆర్‌వో రమేష్, డీఎస్పీ ప్రకాష్, రవాణా శాఖ ఎంఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి

వచ్చే నెలలో నిర్వహించే ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 7,650, ఒకేషనల్ విద్యార్థులు 1500 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 8,034 కాగా ఒకేషనల్ విద్యార్థులు 1,110 మంది పరీక్షలకు హాజరవుతున్నారని అన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, 16న ఇంగ్లీష్ ప్రాక్టికల్స్, 19న ఎన్విరాన్‌మెంటల్ పరీక్షలు జరుగుతాయన్నారు. అదేవిధంగా థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14 వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు మొత్తం 50 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్పీ సింధూశర్మ, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, నోడల్ అధికారి షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప ఆయుధం ఓటు హక్కు

కామారెడ్డి రూరల్: రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప ఆయుధం ఓటు హక్కని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో కొందరికే ఓటు హక్కు అవకాశం ఉండేదని, మహిళలకు ఉండేది కాదన్నారు. కానీ స్వతంత్ర భారత దేశంలో 18 ఏళ్ల వయస్సు కల్గిన ప్రతీ ఒక్కరికి రాజ్యాంగం అవకాశం కల్పించిందని అన్నారు. ఓటు ప్రాముఖ్యతపై డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు మెమొంటో, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. అంతకు ముందు కుల, మత వర్గ, భాషా బేధం లేకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారాం, డీపీవో శ్రీనివాస్, ట్రెజరి అధికారి సాయిబాబ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు వరదారెడ్డి, భూగర్భ జల సహాయ సంచాలకులు సతీష్ యాదవ్, సాయి భుజంగం, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాడి పరిశ్రమకు చేయూత

- గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకానికి ప్రోత్సాహం
- దాణా, పశుగ్రాసం కూడా
- ఆసక్తిగల యువత, రైతులకు 50 శాతం రాయితీ
- జాతీయ పశు అభివృద్ధి పథకం అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

సదాశివనగర్, జనవరి 25: పశు జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తు జాతీయ పశు అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పశుసంపద లేకపోవడాన్ని గుర్తించి, పాడిరంగం అభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణను రూపొందించింది. ఈ మేరకు గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకమే కాకుండా వాటికి అవసరమైన దాణా, పశుగ్రాసానికి ప్రాధాన్యతనిచ్చింది. ఆసక్తి ఉన్న రైతులు, యువతకు 50 శాతం సబ్సిడీ సైతం ఇవ్వనున్నారు. ఈ పథకం పశు సంవర్ధక, పశువైద్యశాఖల పర్యవేక్షణలో అమలవుతోంది.

ప్రాజెక్ట్ నివేదికే ప్రామాణికం

పశుజాతుల అభివృద్ధిపై ఆసక్తి కలిగిన రైతులు, యువత తాము చేపట్టనున్న ప్రాజెక్ట్‌కు సంబంధించి నివేదిక సమర్పించాలి. దాని ఆధారంగా యూనిట్ విలువలో 50 శాతం నిధులను జాతీయ పశు అభివృద్ధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది. చిన్న స్థాయి నుంచి రూ. కోటి వరకు విలువైన యూనిట్లకు కూడా ఇందులో అవకాశం కల్పించారు. బ్యాంకు రుణాల ఆధారంగాను ఈ పథకాన్ని వినియోగించుకునే వెసులుబాటు ఉంది.

వ్యక్తులు, సమూహాలకు అమలు

వ్యక్తులు, సమూహాలైన సరే వినియోగించుకునేలా ఈ పథకాన్ని రూపొందించారు. స్వయం సహాయక బృందాలు, రైతు ఉత్పత్తి సంఘాలు దీన్ని ఉపయోగించుకునే అవకాశముంది. యూనిట్ల నిర్వహణకు అవసరమైన నిధుల్లో 50 శాతాన్ని డిపాజిట్ల ద్వారా బ్యాంకుల నుంచి చూపించవచ్చు. ఆ తర్వాత ప్రాజెక్ట్ రిపోర్టును పరిశీలించి, యూనిట్లకు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనుంది. ప్రాజెక్ట్ స్థాయి ఆధారంగా నిధులను విడతల వారీగా విడుదల చేయనున్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా ఇది జరగనుందని పశు సంవర్ధశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మండల పశువైద్యులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

దరఖాస్తులు ఇలా..

పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మార్చి 31, 2025 వరకు గడువు ఉంది. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు ఎన్‌డీడీబీ.సీఓఓపీ.ఇన్ ద్వారా గొర్రెలు, మేకలు, కోడి పిల్లల ఉత్పత్తి పథకాల కోసం ఎన్ఎల్ఎం. యూడీహెచ్‌వైఏఎంఐఎంఐటీఆర్‌ఏ.కామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నెలకొల్పనున్న యూనిట్ ప్రాజెక్ట్ రిపోర్టు, బ్యాంకు రుణ మంజూరు ముందస్తు పత్రం, పలు వ్యక్తిగత ధ్రువ పత్రాలతో పాటు మరికొన్ని పత్రాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అన్నీ సవ్యంగా ఉంటే యూనిట్‌ను మంజూరు చేసి, రాయితీ డబ్బులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

బ్యాంక్ లింకేజీ ద్వారా యూనిట్ పొందవచ్చు

- ఆర్.రమేష్, పశువైద్యాధికారి, సదాశివనగర్

జాతీయ పశు అభివృద్ధి పథకంను వ్యక్తులు, సమూహాలైన సరే వినియోగించుకునేలా రూపొందించారు. పశు జాతుల అభివృద్ధిపై ఆసక్తి కలిగిన రైతులు, యువత తాము చేపట్టనున్న ప్రాజెక్ట్‌కు సంబంధించి నివేదిక సమర్పించాలి. దాని ఆధారంగా యునిట్ విలువలో 50 శాతం నిధులను జాతీయ పశు అభివృద్ధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది.



కామారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేసిన దృశ్యం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కామారెడ్డి టౌన్, జనవరి 25: భారత గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కామారెడ్డి కలెక్టరేట్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జాతీయ పతాక విష్కరణ చేయనున్నారు. సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంఘం, అధికార, అనధికారులతో పరిచయ కార్యక్రమం, అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అనంతరం సాయంత్రం కామారెడ్డి పట్టణంలోని కళాభారతీలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.



సస్పెక్ట్ షీట్ హోల్డర్స్‌తో మాట్లాడుతున్న సీఐ

శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

- సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 25: కామారెడ్డి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సస్పెక్ట్ షీట్ హోల్డర్స్‌కు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతికి భంగం కలిగించడం, ఎలాంటి దొంగతనాలు, గొడవలు పాల్గొనడం గాని చేసినట్లయితే చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉన్న వాళ్లను వారి యొక్క కేసు స్టేటస్ ఆధారంగా వారిపై ఉన్న సస్పెక్ట్ షీట్లను కూడా పరిశీలించి తీసివేయడానికి పై అధికారులకు విన్నవిస్తామని తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ఘనంగా ముత్యాల పల్లకీ సేవ

జక్రాన్‌పల్లి, జనవరి 25 : మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం రాత్రి ఉంజల పల్లకీసేవ నిర్వహించారు. ప్రతీ నెలలో పౌర్ణమి రోజున ఆలయంలో ఉంజల పల్లకీసేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ప్రతీ నెలలో పౌర్ణమి రోజున ఆలయంలో గుంజల పల్లకీసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉంజల పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఆసుపత్రిలో వసతులపై తీర్మానం

రెంజల్, జనవరి 25 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వసతులపై గురువారం ఆసుపత్రి సలహా కమిటీ ఆధ్వర్యంలో ఎంపీపీ లోలపు రజిని కిషోర్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అవసరాల పనుల కోసం అభివృద్ధి కమిటీ పలు రకాల ప్రతిపాదనలు తయారు చేసింది. అందులో మంజూరైన నిధులను బట్టి అత్యవసర పనుల కొరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ప్రతీ సంవత్సరం ఆసుపత్రికి లక్ష 50వేల రూపాయలు మంజూరు కాగా ఈ సంవత్సరం 75వేల రూపాయలు మాత్రమే విడుదల అయ్యాయని ఆసుపత్రిలో ఉన్న అవసరాల కోసం మాత్రమే ప్రతిపాదనలు బట్టి అత్యవసర పనుల కోసం ఖర్చు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఉప వైద్యాధికారిణి విద్య, ఎంపీడీవో శంకర్, వైద్యాధికారి వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తీరణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, అశ్వక్, రాంచందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడికి రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, జనవరి 25 : ఢిల్లీలో శుక్రవారం జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు హాజరు కావాలని నిజామాబాద్ జిల్లాకు చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బింగి పెంటయ్యకు ఆహ్వానం అందింది. ప్రతీ రాష్ట్రం నుంచి ఉత్తమ మత్స్యకార కుటుంబాలను రిపబ్లిక్ డే వేడుకలను ఆహ్వానించారని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు సెంట్రల్ ఫిషరీష్ బోర్డు వీరికి ఆహ్వానం పంపింది. బింగి పెంటయ్యతో పాటు మరో నలుగురు ఉదయ్ కిరణ్, వంగల రాజు, జనార్ధన్, మోహన్‌కృష్ణలకు ఆహ్వానలు అందినట్లు బింగి పెంటయ్య తెలిపారు. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

డిచ్‌పల్లి, జనవరి 25: మండలంలోని మిట్టపల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు బాలగంగాధర్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీగౌడ్ పరామర్శించారు. ఇటీవల ఎంపీటీసీ తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వీజీ గౌడ్ మాట్లాడుతూ.. ఎంపీటీసీ బాలగంగాధర్ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అన్నారు. ఆయన వెంట సర్పంచ్‌లు తేలు గణేశ్, తిరుపతి, పార్టీ ప్రతినిధులు ఒడ్డం నర్సయ్య, అంకం గంగరత్నం, గొప్ప వెంకన్న, నారాయణ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యూలర్ చేయాలి

పెద్దబజార్, జనవరి 25: కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తెన్న, సుధాకర్‌లు అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు ఐదు జీవోల గెజిట్ చేయాలని మిగతా 68 షెడ్యూల్ జీవోలు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, వెంకన్న, మల్లేష్, కిషన్, మురళి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 3 కోట్ల 35 లక్షల అభివృద్ధి పనులకు కార్యరూపం దాల్చేనా ?

- నిజాంసాగర్‌లో సెంట్రల్ లైటింగ్, షాదీ ఖానా నిర్మాణాలు కలేనా?
- శంకుస్థాపనలు చేసిన అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- అభివృద్ధి పనుల కోసం మండల వాసులు ఎదురు చూపులు



సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం(ఫైల్)

నిజాంసాగర్, జనవరి 25: మండలకేంద్రంలోరూ.3 కోట్ల 35 లక్షలతో మంజూరైన అభివృద్ధి పనులకు కార్యరూపం దాల్చడం లేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నాసాగర్ - పిట్లం రహదారి 3/4 నుంచి 3/670 కిలో మీటర్ల పొడవు సెంట్రల్ లైటింగ్ పనులకు ఎస్‌డీఎఫ్ కింద రూ.3కోట్లు మంజూరయ్యాయి.ఈనిధులతో సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజులు శంకుస్థాపనలు చేశారు. రూ. 25 లక్షలతో షాదీఖానాకు శంకుస్థాపన చేయగా, బంజారా కమ్యూనిటీ నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించి శంకుస్థాపనలు చేశారు.సెంట్రల్ లైటింగ్‌కుకాంట్రాక్ట్ పనులు పూర్తి కాగా ఎన్నికల కోడ్‌పడటంతో పనులకు బ్రేక్ పడింది.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎస్‌డీఎఫ్ నిధుల కింద మంజూరైన అభివృద్ధి పథకం నిర్మాణ పనులు చేపట్టరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. మండల కేంద్రంలో రూ.3కోట్ల 35లక్షల అభివృద్ధి పనులు 2022-23 ఆర్థిక సంవత్సరం క్రితమే పనులు మంజూరు చేశారు. నిజాంసాగర్ పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా ఉండటంతో మండల కేంద్రంలో ఉన్న అన్నాసాగర్ - పిట్లం రహదారి 670 అడుగుల పొడవు రహదారికి సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టేందుకు రోడ్లు భవనాలశాఖ సర్వే కూడా చేసింది. ఈ పనులు త్వరిత గతిన చేపట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేసింది. షాదీఖానా నిర్మాణంచేపట్టాలని అప్పటి జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండేకు మైనార్టీలు కోరగా, రూ. 25 లక్షలతో షాదీఖానా కోసం ఉత్తర్వులు జారీచేసింది. సెప్టెంబరు 25న శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తయ్యేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి రూ. 10 కోట్లు కేటాయించారు తప్ప గత ప్రభుత్వాలు శంకుస్థాపనలు చేసిన పనులకు నిధులు సమకూర్చేరా అని ప్రశ్నార్థకమే. అచ్చంపేట, మర్పల్లి, లింగంపల్లి, బ్రాహ్మణ్ పల్లి బీటీరోడ్లు నిర్మాణాలు ఏళ్ల తరబడి ఎదురు చూసినా గత సెప్టెంబరులో మంజూరు కావడంతో ఈ గ్రామాల ప్రజలు ఎంతో సంతోషంతో ఉన్నప్పటికి వీటి నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నిలిచిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు.

హైదరాబాద్‌కు తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

ధర్పల్లి, జనవరి 25: హైదరాబాద్‌లో గల లాల్‌బహదూర్ శాస్త్రీ స్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి ధర్పల్లిలోని వివిధ గ్రామాల నుంచి బూత్ కమిటీ సభ్యులు తరలి వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, శ్రీకాం త్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి,ఆనంద్,సుదర్శన్,గంగయ్య, జానీ,మధు, తదితరులు ఉన్నారు.

నవీపేట: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో గురువారం జరిగిన తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్స్ కన్వెక్షన్ కార్యక్రమంలో పాల్గొనడానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ మేరకు ప్రత్యేక వాహనంలో కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సంజీవ రెడ్డి, శ్రీనివాస్, రవి, గంగాధర్, జబీర్, తదితరులున్నారు.

మోర్తాడ్: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో బూత్‌లేవల్ కమిటీ శిక్షణ సమావేశానికి బాల్కొండ నియోజకవర్గం నుంచి 400మంది కార్యకర్తలు ఎనిమిది బస్సులలో బయలుదేరి వెళ్లారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌కార్గె ముఖ్యఅతిథిగా పాల్గొనే సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొంటారని నాయకులు తెలిపారు.

ముప్కాల్: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో బూత్‌లేవల్ కమిటీ శిక్షణ సమావేశానికి గురువారం బాల్కొండ, ముప్కాల్ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు బయలుదేరి వెళ్లారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌కార్గె ముఖ్యఅతిథిగా పాల్గొనే సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొంటారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ బూత్ కమిటీ సభ్యులు

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంద రవి, చిన్నారెడ్డి, పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో గురువారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ బూత్ లెవల్ సమావేశానికి డిచ్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో బూత్ లెవల్ నాయకులు తరలివెళ్లారు. కాంగ్రెస్ ను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేస్తామని ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గె, సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డిలు హాజరయ్యారనియ అమృతాపూర్ తెలిపారు. సమావేశానికి తరలిన వారిలో కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, వాసుబాబు, శ్రీనివాస్ గౌడ్, ముల్లంగి నర్సయ్య, రమేశ్ గౌడ్, పెద్దొళ్ల శ్రీను, ధర్మగౌడ్, సాయిరెడ్డి, వెంకటేశ్, నరేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

సిరికొండ: గురువారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన బూత్ లెవల్ కన్వీనర్ల సమావేశానికి సిరికొండ మండలం నుంచి మండల అధ్యక్షులు బాకారం రవి, జిల్లా కార్యదర్శులు ఎర్రన్న, సంతోష్‌ల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గె ముఖ్య అతిథిగా హాజరైన విషయం పాఠకులకు విదితమే. వీరి వెంట సీనియర్ నాయకలు బాల్‌రాజ్ నాయక్‌రైతు విభాగం అధ్యక్షుడు నర్సారెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆసిఫ్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబురావు, బీసీ సెల్ అధ్యక్షుడు నర్సింగ్ తదితరులు ఉన్నారు.

కోటగిరి: రాష్ట్ర రాజధానిలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన బూత్ కన్వీనర్ సమావేశానికి గురువారం కోటగిరి, పొతంగల్ మండలాల నుండి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కోటగిరి, పొతంగల్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు షాహీద్, వహీద్, ఆనంద్, దత్తు, తదితరులు హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్

బోధన్ రూరల్, జనవరి 25 : దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రధానమంత్రి ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నవ ఓటర్లను ఉద్దేశించి మార్గనిర్దేశం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికి యువత ప్రముఖ పాత్ర వహించాలని కోరారు. వికసిత్ భారత్‌గా చేయాలనే సంకల్పాన్ని తీసుకునే విధంగా పాల్గొన్న యువకులతో ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, బీజేపీ జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ యోగేష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బాల్‌రాజ్, వెంకటేష్, అరవింద్, రంజిత్, ప్రకాష్, చరణ్‌లతో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్

ఆర్మూర్‌టౌన్ యువత దేశ ప్రగతి కోసం ముందుండాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అల్జాపూర్ శ్రీనివాస్, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. గురువారం చేపూర్‌లోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా యువ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రతీఒక్కరి బాధ్యత అని, ఏలాంటి ప్రలోభాలకు లోంగకుండా దేశప్రగతిని దృష్టిలో ఉంచుకొని యువత ఓటు హక్కును వినియోగించుకో వాలని అన్నారు. అవినీతి రహిత దేశం కోసం ప్రధాని మోదీ ఆధ్వర్యంలో శాస్త్ర, సాంకేతి రంగాలలో, వైద్య రంగాలలో దేశ ప్రగతి పథంలో ముందుకు వెళ్తుందని ఆయన నాయకత్వం బలపర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ప్రధాని మోదీ వర్చువల్ కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి మందుల బాలు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగ సురేష్, దినేష్‌రెడ్డి, కలిగోట ప్రశాంత్, నరేష్‌చారి, రాజశేఖర్, నిఖిల్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి సస్పెన్షన్

వర్ని,జనవరి25: వర్ని మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మార్కెట్ కమిటీ పరిధిలోని ప్యాడి క్లీనర్‌కు సంబంధించిన 19మోటార్లు అపహరణకు గురి కావడంతో రాష్ట్ర మార్కెట్ కమిటీ కమీషనర్ లక్ష్మీబాయి విచారణ జరిపి ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిపై తక్షణ చర్యలకు ఆదేశించారు. అలాగే మార్కెట్ కమిటీ గోదాంలలో బ్లాక్‌లో ధాన్యం నిల్వలపై ఆమె నివేదిక కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తక్కువ ధరకు కొనుగోలు చేసి టన్నుల కొద్దీ బ్లాక్‌లో ధాన్యం నిల్వల కోసం గోదాంలను వాడుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌పై తప్పుడు రికార్డులు సమర్పించి లక్షల్లో బిల్లులు స్వాహా చేశారన్న ఆరోపణలపై ఆమె నివేదిక కోరారు. మార్కెట్ కమిటీలో తరుచూ జరుగుతున్న అక్రమాలపైకిందిస్థాయి సిబ్బంది చేతివాటం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నేటి నుంచి కమ్మర్‌పల్లిలో రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ టోర్నమెంట్

కమ్మర్‌పల్లి జనవరి 25: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కేబీఏ ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్‌అసోషియేషన్ అధ్యక్షుడు ఎండి అహ్మద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఈ టోర్నమెంట్‌ను ప్రారంభంచనున్నట్లు తెలిపారు. ఈటోర్నమెంట్‌లో డబుల్, సింగిల్ 40ప్లస్ వయసు కేటగిరిలో నిర్వహింపబడుతోందని ఎంట్రిఫీజు రూ.ఆరువందల ఉంటుందన్నారు. టోర్నిలో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల జట్లు మధ్యాహ్నంవరకు చింత తిరుపతి (9440295523), పవన్ (991217929) సంప్రదించాలన్నారు. విజేత జట్లకు ట్రోఫీతో పాటు నగదు ప్రోత్సాఖంగా అందజూయబడుతుందన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



మోర్తాడ్‌లో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న పంచాయతీ వర్కర్స్

మోర్తాడ్, జనవరి25: మోర్తాడ్ మండల కేంద్రంలో గురువారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 28 (ఆదివారం) జరిగే తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభ విజయవంతం చేయాలని వారు కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో కిషన్, లక్ష్మణ్, మజీద్, చిన్నక్క, రాజేశ్వర్, దుర్గయ్య, నర్సయ్య, గంగారాం,ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వైకే జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యునిగా తిరుపతినాయక్

ఆర్మూర్‌టౌన్, జనవరి25: నెహ్రూ యువక కేంద్రం జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యుడిగా గుగులోత్ తిరుపతినాయక్‌ను నియామించారు. కేంద్ర మంత్రి అను రాగ్‌సింగ్ ఠాగూర్ ఆదేశాల మేరకు ఎన్‌వైకెఎస్ డైరెక్టర్ జనరల్ నితిష్‌కుమార్ మిశ్రా గుగులోత్ తిరుపతినాయక్‌ను నియామిస్తూ నియామకపత్రం పంపారు. తనపై నమ్మకంతో బాధ్యతను ఇచ్చిన కేంద్ర మంత్రికి, డైరెక్టర్ జనరల్‌కు సహకరించిన బీజేపీ రాష్ట్ర జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. యువత క్రీడా సామాజిక సేవ కార్య క్రమాలలో తనవంతు కృషి చేస్తానని తిరుపతినాయక్ అన్నారు.

అయోధ్యలో విశోకతీర్థస్వామికి ఘనస్వాగతం

ముప్కాల్, జనవరి25: అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతి ష్టాపన కార్యక్రమంలో పాల్గొని వచ్చిన విశోక తీర్థస్వామికి విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో గురువారం బాల్కొండలో ఘన స్వాగతం పలికారు. బాల్కొండ బైపాస్ నుంచి వన్నెల్(బి) చౌర స్తా వరకు విశోక తీర్థస్వామికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో బాల్కొండ అయోధ్య తీర్థ కమిటీ సభ్యులు, విశ్వ హిందు పరిషత్ సభ్యులు, భజరంగ్‌దళ్ సభ్యులు, హిందు బంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

బాన్సువాడటౌన్, జనవరి 25: బాన్సువాడ పట్టణంలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాల్లో , వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు అధికారులు , నాయకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. జెండా గద్దెలను , కార్యాలయాలను రంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. జెండాను ఆవిష్కరించేందుకు సిద్ధం చేసి ఉంచారు.

టీజేఎస్ నాయకుల సంబరాలు



టపాకాయాలు కాలుస్తున్న టీజేఎస్ నాయకులు

కామారెడ్డి టౌన్, జనవరి 25: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియామకమైన టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు శుభాకాంక్షలు తెలుపుతూ కామారెడ్డి జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో టీజేఎస్ ఆధ్వర్యంలో టపాకాయాలు కాల్చి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్య క్షుడు లక్ష్మన్‌యాదవ్ మాట్లాడుతూ ఇదితెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవమని అనే కమంది ఉద్యమకారుల పోరాట సమిష్టిఫలితం అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్య మపోరాటంలో కీలకంగా వ్యవహరించి తెలంగాణ సాధన కోసం నిరంతరం శ్రమించిన పోరాటయోధుడు కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన కోదండరాంకు ఇది సుముచిత గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు,జిల్లా నాయకులు పూలొంగ్ రాథోడ్, రాజుయాదవ్, ప్రకాష్‌నవీన్‌కుమార్,ఈశ్వర్, ప్రకాష్, అశోక్ పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణి మహితను అభినందిస్తున్న ప్రిన్సిపల్

డిచ్‌పల్లి, జనవరి 25: జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ధర్మారం(బి) గురుకుల పాఠశాల విద్యార్థిని మహిత ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సంగీత గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు మహిత ఎంపికైందన్నారు. ఈ నెల 28నుంచి వచ్చే నెల 1వరకు చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో కోర్బా జిల్లాలో జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పెడరేషన్ అండర్ -14 లో మహిత పాల్గొంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి, పీఈటీ జ్యోత్స్న, దమయంతి, లు అభినందించారు.

27న బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం

సుభాష్‌నగర్, జనవరి 25: జిల్లా కేంద్రంలో 27వ తేదీన తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు పాండు యాదవ్, సిర్నాపల్లి శ్రీహరిలు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ వర్గానికి చెందిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కార్పూరి ఠాకూర్ శతజయంతి సందర్భంగా భారతరత్న ప్రకటించడాన్ని హర్షిస్తూ కేంద్ర ప్రభుత్వానికి బీసీ కులాల ఐక్యవేదిక కృతజ్ఞత తెలుపుతుందన్నా రు. ఇప్పటికైనా ఠాకూర్‌ను గుర్తించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర ప్రస్తుత రాజకీయాల్లో బీసీల పాత్ర నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సంస్థాగత కార్యక్రమాలు, సంస్థ నిర్మాణం జిల్లా స్థాయి మొదలుకొని గ్రామస్థాయి వరకు కమిటీలు చేయడం, బీసీలకు జరుగుతున్న అన్యాయాలు, నిర్లక్ష్యం,పక్షపాతధోరణి, ఆధిపత్యరాజకీయ పార్టీల వైఖరిపై గ్రామ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లడం పై చర్చ ఉంటుందన్నారు.

భగవద్గీత ప్రచార మండలి జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక

బోధన్ రూరల్, జనవరి 25: బోధన్ పట్టణంలోని శ్రీ సాయి బాబా రాధాకృష్ణ మందిరం ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కులకర్ణి అశోక్‌రావును నియమించడం జరిగిందని అఖిల భారతీయ భగవద్గీత ప్రచార మండలి సభ్యులు తెలిపారు. అఖిల భారతీయ భగవద్గీత ప్రచార మండలి జిల్లా కార్యవర్గ సభ్యులుగా పబ్బ మురళి, జేఏసీ గోపాల్‌రెడ్డి,మారోజు సుధాకర్ చారి,కులకర్ణి అశోక్‌రావులు నియమితులయ్యారు.

మోర్తాడ్‌లో జాతీయ బాలికల దినోత్సవం

మోర్తాడ్: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో గురువారం జాతీయ బాలి కల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. డ్రాయింగ్‌లో గెలుపొందిన బాలికలకు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడి టీచర్‌లు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జక్రాన్‌పల్లి, జనవరి25: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్రీడా దుస్తువులను మాజీడీసీఎం ఎస్‌చైర్మన్, మునిపల్లి సర్పంచ్ ఎం.సాయిరెడ్డి పంపిణీ చేశారు. దాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి 42మంది విద్యార్థులకు క్రీడా దుస్తువులను కొనుగోలు చేసి ఈ క్రీడా దుస్తులను విద్యార్థులకు సాయిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి, లక్ష్మాపూర్ సర్పంచ్‌లు ఎం. చిన్న సాయిరెడ్డి, కైలాస్‌నాయక్, ఎంపీటీసీ అను, ఎంఈవో శ్రీనివాస్, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదకాలువలో పడి వ్యక్తి గల్లంతు

ముప్కాల్, జనవరి25: బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన గడ్డం సాయన్న(58) అనే వ్యక్తి గురువారం వరదకాలువలో పడి గల్లంతైనట్లు ఎస్సై గోపి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఉదయం 11గంటలకు వరదకాలువలో గల తన విద్యుత్‌మోటారు మరమ్మతు చేయడానికి వైర్ పట్టుకొని దిగి మోటారు నుంచి వైర్‌ను తీస్తుండగా వైర్ తెగి వరదకాలులో పడి కొట్టుకుపోయాడన్నారు. గడ్డం సాయన్న ఆచూకికై పరి సర ప్రాంతాల్లో గాలించగా ఆచూకీ లభించలేదు. సాయన్న భార్య లింగు బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్),జనవరి25: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో గురువారం పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను మాజీ జడ్పీ చైర్మన్ దఫెదార్ రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వాజీద్ అలీ, కాశయ్య, ఇప్తాకర్, చంద్రశేఖర్, మహేందర్, నారాయణ, ప్రవీణ్, మల్లారెడ్డి, సాయిలు, సాయాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నైట్ ఇండియా టీయూ కోఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 25: యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఆధ్వర్యంలో ఇగ్నైట్ ఇన్ ఇండియా 2047 విజన్ ఆఫ్ ది డెవలప్‌మెంట్ పేరుతో ఫిబ్రవరి నెలలో వర్సిటీలు కళాశాలలు నిర్వహించబోయే యువ మంథాన్ ఎక్స్‌పర్‌మెంటల్ లెర్నింగ్ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ కోఆరినేటర్ ప్రొ.రవీందర్‌రెడ్డి నియమిస్తునట్లు యూజీసీ సెక్రటరీ దీపాలి జైస్వాల్ గురువారం నియామక ఉత్వర్వులు అందజేశారు. యూజీ, పీజీ విద్యార్థులకు యువ మంథాన్ మోడల్ యూనైటెడ్ నేషన్ పేరుతో నూతన ఆవిష్కరణలు, గ్లోబల్ డిప్లమసీ స్కిల్‌డెవలప్‌మెంట్ భారత ప్రజాస్వామ్య భవిష్యత్ అనే అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారని రవీందర్‌రెడ్డి తెలిపారు. కోఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి నియామకం పట్ల రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి, సీనియర్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ముప్కాల్, జనవరి25: బాల్కొండ మండల కేంద్రంలోని రెబత్తి రక్షిత్ మూడు నెలల క్రితం పోగొట్టుకోగా గురువారం ఎఎస్సై శంకర్ బాధితునికి అందజేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోరీకి గురైన ఫోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి ఇవ్వడం జరుగుతుందని అన్నారు.



కౌలాస్ కోటపై జెండా గద్దెను నిర్మించిన దృశ్యం

రిపబ్లిక్ డే వేడుకలకు సిద్ధమైన కౌలాస్ కోట

పెద్ద కొడప్‌గల్, జనవరి 25: కౌలాస్ కోటపై నేడు జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు సిద్ధంగా మారింది. ఎంతో విశిష్టత కలిగిన కోటపై గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేయాలని జుక్కల్ ఎమ్మెల్యే నిర్ణయం తీసుకోవడంతో అధికారులు ఉరుకులు పరుగుల మీద పనులు చేపట్టారు. కోటపై జెండా గద్దె నిర్మించడంతో పాటు, కోటకు వెళ్లే రహదారిలో మెట్లపై గల మొక్కలను తొలగించారు. గతంలో కోటలోకి విద్యుత్ కనెక్షన్ ఉన్న, విద్యుత్ వైర్లు కిందికి రావడంతో వాటిని సరి చేశారు. జెండా గద్దెను పూర్తి చేసి వేడుకలకు ముస్తాబు చేసి సిద్ధంగా ఉంచారు. వారం నుంచి కోటపై జెండా గద్దెతో పాటు కోటకు వెళ్లే రహదారి బాగు చేయించే పనులను జుక్కల్ ఎంపీడీవో దగ్గర ఉండి పర్యవేక్షించారు.

పాడి పశువులతో రైతులకు లబ్ధి

లింగంపేట, జనవరి 25: ప్రతీ రైతు పాడి పశువులను పెంచుకోవాలని, పాడి పశువులతో రైతులకు ఆదాయం సమకూరి లబ్ధి చేకూరుతుందని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సింహారావు అన్నారు. లింగంపేట మండలం మోతె గ్రామంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. పశువులతో పాల ఉత్పత్తులను పెంపొందించుకునేందుకు చేపట్టాల్సిన మెలకువలను ఆయన రైతులను వివరించారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేసుకోవాలని తెలిపారు. గాలికుంటు, గొంతువాపు, మెదడువాపు, నివారణ టీకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని, అన్ని ప్రభుత్వ పశువైద్య కేంద్రాలలో దొరుకుతాయని తెలిపారు. పాడి గేదెలు, ఆవులకు సమీకృత దాణా అందించాలని దాంతో పాల ఉత్పత్తులు పెరిగి రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఆయన తెలిపారు. గ్రామంలోని 80 పశువులకు వైద్య చికిత్సలు చేపట్టి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారులు రవికుమార్, రవికిరణ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ కృష్ణ, వెటర్నరి అసిస్టెంట్ రవి, గ్రామ సర్పంచ్ రాంరెడ్డి, పాల కేంద్రం అధ్యక్షుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బీర్కూర్, జనవరి 25 : మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలో మంజీరా నది పరివాహక ప్రాంతంలో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ.2,410 స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై సీతా రామమ్మ తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే సమాచారం అందించాలని ఆమె కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు.



పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

బీర్కూర్, జనవరి 25: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా బాలుర గురుకుల పాఠశాలలో గురువారం వైద్య సిబ్బంది 153 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు, చికిత్స చేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఆర్‌బీఎస్‌కే బృందం బీర్కూర్ గురుకుల పాఠశాలలో 8 నుంచి 12వ తరగతికి చెందిన 153 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు మందులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం కవిత, ఫార్మాసిస్ట్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్

● లెక్చరర్‌ను చితకబాదిన విద్యార్థిని కుటుంబీకులు

నాగిరెడ్డిపేట, జనవరి 25: మండల కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఓ విద్యార్థినిపై అదే కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్ అస్యభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌ను బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులు చితక బాదినట్లు సమాచారం. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. మండల కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో గత కొన్ని సంవత్సరాలుగా జువాలజీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కిషన్ రాథోడ్ వారం రోజుల క్రితం ఇదే కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని కళాశాల ల్యాబ్‌లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించినట్టు తెలిసింది. దీంతో సదరు విద్యార్థిని ఇంటికి వెళ్లాక విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు మరునటి రోజు కళాశాలకు వచ్చి జువాలజీ లెక్చరర్ కిషన్ రాథోడ్‌ను చితకబాదినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ మన్మోహన్‌రెడ్డి కిషన్ రాథోడ్‌ను వెంటనే విధుల నుంచి తొలగించేశారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

రాజంపేట, జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ పాఠశాల విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని అలాంటి ఓటును దుర్వినియోగం పరచకుండా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, నాయబ్ తహసీల్దార్ సంతోషి, గిర్దావర్ సంతోష్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌వీర్ పంచాయతీ కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయించారు. నిష్పక్షపాతంగా సార్వభౌమాధికారాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంజయ్ రావు, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, ఎంపీపీ కానుగంటి శారద, షమ్మీ, నయాబ్ తహసీల్దార్ రేఖ, ఎంపీవో తిరుపతిరెడ్డి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు హక్కు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, దీప్తి, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: డోంగ్లీ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓటర్లచే తహసీల్దార్ రేణుక ప్రతిజ్ఞ చేయించారు. భారత దేశ ప్రజలమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, యువత నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడుతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో అందరూ ఓటరు హక్కును కలిగి ఉండాలని ఏఎస్పీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని మహిళలు, పురుషులు, ధనికులు, పేదవారు, ఎవరు ఎంత పవర్‌లో ఉన్నా సాధారణ పౌరునికైన ఓటు విలువ సమానంగా ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ కాజోల్‌సింగ్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ సంతోష్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకటొరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సాయిబాలాజీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు తమతమ గ్రామంలో నూతన ఓట్లను నమోదు చేయించాలన్నారు.

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలో తహసీల్దార్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఓటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్‌లు, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.



కామారెడ్డిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ నరసింహారెడ్డి



నాగిరెడ్డిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు



తాడ్వాయిలో..



నిజాంసాగర్‌లో..

నేడు గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవం



గోపాల్‌పేట్ నూతన గ్రామ పంచాయతీ భవనం

నాగిరెడ్డిపేట, జనవరి 25: నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని శుక్రవారం మధ్యాహ్నం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రారంభోత్సవం చేయనున్నట్లు గోపాల్‌పేట్ సర్పంచ్ వంజరి సునీతా కిరణ్ తెలిపారు. గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీకి సొంత భవనం లేక పోవడంతో, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 20 లక్షల రూపాయలతో నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరైంది. ఇటీవలే గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులన్నీ పూర్తయ్యాయి. ఈనెల 4వ తేదీన గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. కాగా, ప్రస్తుతం గణతంత్ర దినోత్సవం శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

పెద్ద కొడప్‌గల్, జనవరి 25: మండలంలోని అంజనీ, పోచారం, శివ్వాపూర్ గ్రామాల్లో గురువారం పెద్ద కొడప్‌గల్ వ్యవసాయాధికారితో పాటు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ప్రస్తుతం మొక్కజొన్న పంటకు వడల తెగులు వ్యాపిస్తున్నదని దీని నివారణకు టెబుకోనజోల్ ఒక మిల్లీ లీటరు నీటికి కలిపి నేల బాగా తడిసేలా పిచికారి చేసుకోవాలని సూచించారు. ఇక కత్తెర పురుగు కూడ ప్రస్తుతం మొక్కజొన్న పంటకు బాగా వ్యాపిస్తున్నదని, దీని నివారణకు గాను కోరాజిన్ 60 ఎంఎల్ ఒక ఎకరానికి 150 నుండి 200 లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు సజ్జన్‌లాల్, నారాయణ, మోతీలాల్, రామారావ్ తదితరులు పాల్గొన్నారు.



అంజనీ శివారులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

గాంధారి, జనవరి 25: కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ బూత్ లెవల్ సమావేశానికి తరలివెళ్లారు. బూత్‌లెవల్ కన్వీనర్ల శిక్షణ శిబిరానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రం నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు తూర్పురాజులు, బాల్‌రాజ్, కార్యదర్శి లైన్ రమేష్, బాల్‌రాజ్, టౌన్ ప్రెసిడెంట్ నీల రవి, సంగని బాలయ్య, ఈశ్వర్‌గౌడ్, సయ్యద్ హైమద్, బాలయ్య, గణేష్, వసంత్‌రావు, దుర్గం, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ బూత్ లెవల్ సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలిశారు. లింగంపేటసమీపంలోని మత్తడిపోచమ్మ గుడి వరకు, లింగంపేట పోలీసుస్టేషన్ నుంచి పోస్టాఫీస్‌వరకు గల రోడ్లను సీసీరోడ్లుగా నిర్మాణం చేపట్టాలని, మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో కనీస వసతలు లేక అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీనియర్ లీటర్ బుర్ర నారాగౌడ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

బీర్కూర్: మాజీ మంత్రి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన షబ్బీర్ అలీని గురువారం హైదరాబాద్‌లో డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డితో పాటు బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాను కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్, మాజీ సర్పంచ్ తోట నారాయణ, ఉమ్మడి మండలాల మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు ఇక్బాల్, గొండ్ల శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు బడిలో చేరిక

నిజాంసాగర్, జనవరి 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఆర్పీలు నర్సింలు, శ్రీధర్ కుమార్ బడి బయట ఉన్న పిల్లల సర్వేలో గుర్తించిన 6 నుంచి 14 సంవత్సరాలు కలిగిన ఇద్దరు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. అర్జున్ 6వ తరగతి (సుల్తాన్‌నగర్), గౌస్ 6వ తరగతి (సుల్తాన్‌నగర్)లను పాఠశాలలో చేర్పించినట్లు ప్రధానోపాధ్యాయులు రాంచందర్ తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశం ఒక జత యూనిఫాంను అందజేశారు. గణతంత్ర దినోత్సవం రోజున పాఠశాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ

కామారెడ్డిటౌన్, జనవరి 25: కామారెడ్డి నియోజకవర్గంలో ఆయా మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు మృతి చెందడంతో వారి కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ ప్రమాదబీమా చెక్కులను గురువారం పంపిణీ చేశారు. మాచారెడ్డి మండలం మైసమ్మ చెరువుతండాకు చెందిన అజ్మీరా సీతారాం మృతి చెందగా అతనిభార్య మంగమ్మకు, దోమకొండ మండలం అంబారీపేట్ గ్రామానికి చెందిన సరికొండ లింగారెడ్డి మృతిచెందగా అతన భార్య సరితకు, మద్దికుంటకు చెందిన గజ్జెల లింగం మృతిచెందగా అతని భార్య తులసమ్మకు, కామారెడ్డి మండలం సరంపల్లి గ్రామానికి చెందిన ఆకుల లింగం మృతిచెందగా అతని భార్య లావణ్యకు, తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఎల్లవ్వ మృతిచెందగా ఆమె భర్త భిక్షపతిలకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మొత్తం 10లక్షలను బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వబీమా నుంచి మంజూరైన చెక్కులను అందించారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంబారీశ్వరుని జాతర



భూంపల్లిలో అంబారీశ్వరుని జాతరలో పాల్గొన్న భక్తులు

సదాశివనగర్, జనవరి 25: మండలంలోని భూంపల్లి అంబారీశ్వరుని జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. పుష్యమాసం పౌర్ణమి సందర్భంగా ప్రతి సంవత్సరం జాతర నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. ఉదయం అంబారీశ్వరునికి మంగళస్నానాలు నిర్వహించి పుష్పాభిషేకం చేశారు.అనంతరం పెద్ద ఎత్తున అగ్ని హోమం కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారి చరిత్రను వేది పండితులు భక్తులకు వినిపించారు. సాయంత్రం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. త్వరలోనే అంబారీశ్వరాలయ నిర్మాణం రాతితో కొనసాగుతున్నందున కార్తీక పౌర్ణమిలోపు పూర్తిచేయడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ లలితాభాయ్, ఉపసర్పంచ్ సాయిలు, ఎంపీపీ అనసూయ,ఆలయకమిటి అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.